
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

సంగారెడ్డి 5 మెదక్

మంగళవారం 27 ఆగస్టు 2024

జిల్లాల వార్తలు





మెదక్‌లో ఉట్టికొడుతున్న చిన్నికృష్ణుడు



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా జరుపుకున్నారు. మురళీకృష్ణుడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊరూరా వేడుకలు జరుపుకున్నారు. కోలాటాలు, భజనలతో సందడి నెలకొన్నది. రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టే ఉత్సవంలో చిన్నాపెద్ద ఉత్సాహంగా పాల్గొన్నారు.

కృష్ణం వందే..



జహీరాబాద్‌లో గోపికల నృత్యం

కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టిన జగ్గారెడ్డి



సంగారెడ్డిలోని రామ్‌మందిర్ వద్ద కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



కృష్ణాష్టమి వేడుకల్లో డోలక్ వాయిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఐఐటీ హైదరాబాద్‌లో

మంత్రి శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి సందర్శన



ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఐఐటీ హైదరాబాద్ విద్యాసంస్థను సందర్శిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పక్కన ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



పరిశోధనల గురించి ఐఐటీహెచ్ విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, వేదికపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

పంటల వివరాలు

పక్కాగా..

మెదక్ జిల్లాలో 80 క్లస్టర్లు.. క్లస్టర్లవారీగా నమోదు

ఏఈవోలకు ప్రత్యేక యాప్.. భూ నక్షాతో అనుసంధానం

ఇప్పటివరకు 70 శాతం వివరాల సేకరణ పూర్తి



మెదక్, ఆగస్టు 26: గ్రామాల్లో పంటల సాగు నమోదు ప్రక్రియ జోరుగా సాగుతున్నది. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఈ వానాకాలం 3.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. ఇప్పటివరకు 1,93,583 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. అత్యధికంగా 1,50,024 ఎకరాల్లో వరి నాట్లు, 32,372 ఎకరాల్లో పత్తి వేసుకున్నారు.

క్లస్టర్‌కు ఓ అధికారి

పంటల వివరాల నమోదు ప్రక్రియ జూలై మొదటి వారం నుంచి ప్రారంభమైంది. రుణమాఫీ ప్రక్రియతో మధ్యలో కొంత నెమ్మదించినా ప్రస్తుతం వ్యవసాయశాఖ అధికారులు పంటల వివరాల నమోదులో బిజీగా ఉన్నారు. జిల్లాను 80 క్లస్టర్లుగా విభజించి.. ఒక్కో క్లస్టర్‌కు ఒక్కో అధికారిని నియమించారు. వారంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులు సాగుచేసిన పంటల వివరాలు, కావాల్సిన ఎరువులు, విత్తనాలు తదితర వివరాలను నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 70 శాతం నమోదు పూర్తిచేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక మొబైల్ యాప్

పంటల సాగు వివరాలు సేకరించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. దీనిని తెలంగాణ భూనక్షా యాప్‌తో అనుసంధానించారు. వ్యవసాయ అధికారులు పంట పొలాల వద్దకు వెళ్లి యాప్‌ను ఆన్‌చేయగానే చుట్టూ 50 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం, ఆధార్‌కార్డు నంబర్ కనపిస్తాయి. గతంలో సాగు చేసిన పంటల వివరాలతో పాటు ఈ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను నమోదుచేసి, పంట ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు.

వర్షాలు లేక ఈసారి పంటల సాగు ఆలస్యం



జిల్లావ్యాప్తంగా పంటల సాగు వివరాల నమోదు 70 శాతం పూర్తయ్యింది. మిగిలింది త్వరలోనే పూర్తిచేస్తాం. వర్షాలు సకాలంలో పడకపోవడంతో రైతులు పంటలు ఆలస్యంగా వేసుకున్నారు. 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేశాం. కానీ ఇప్పటివరకు 1,50,000 ఎకరాల్లోనే నాట్లు వేశారు. సమయం మించిపోవడంతో ప్రత్యామాయ పంటల వైపు దృష్టిసారిస్తే మంచింది. ఆలస్యంగా నాట్లు వేస్తే చీడపీడలు సోకే ప్రమాదం ఉంటుంది.

-గోవింద్, మెదక్ జిల్లా వ్యవసాయాధికారి

ఆ ఊళ్లో మద్యం అమ్మితే

రూ.2 లక్షల జరిమానా

పట్టించినవారికి రూ.50 వేల నజరానా

అప్పాజీపల్లిలో గ్రామ పెద్దల తీర్మానం



బెల్ట్‌షాప్ నిషేధంపై చర్చిస్తున్న అప్పాజీపల్లి గ్రామస్థులు

అల్లాదుర్గం, ఆగస్టు 26 : బెల్టుషాపుల కట్టడికి ఆ గ్రామస్థులు ముందడుగు వేశారు. విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో ప్రజలు మద్యానికి బానిసై కొట్లాటలు పెరుగుతున్నాయని.. మద్యం అమ్మకాలను నిషేధించారు. ఎవరైనా మద్యం అమ్మితే రూ. 2 లక్షలు జరిమానా విధించాలని నిర్ణయించారు. అంతేకాదువిక్రయించే వారిని పట్టిస్తే రూ.50వేలు నజరానా ఇస్తామని కూడా ప్రకటించారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామస్థులు గ్రామంలో మద్యం అమ్మవద్దని తీర్మానం చేశారు. గ్రామ ప్రజలంతా సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమై మద్యం అమ్మకాలతో జరుగుతున్న అనర్థాలపై చర్చించారు. విచ్చలవిడి విక్రయాలతో శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా సంసారాలు నాశనమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో మందు అమ్మితే భారీగా జరిమానా విధించాలని, పట్టిచ్చినవారికి బహుమతి ఇవ్వాలని తీర్మానించారు. అప్పాజిపల్లి వాసుల నిర్ణయంపై మండలంలో చర్చ జరుగుతున్నది. అన్ని గ్రామాల్లోనే ఇలా బెల్టు షాపులను కట్టడిచేస్తే పల్లెలు బాగుంటాయని అభిప్రాయపడుతున్నారు.

ఆటాడుకుందాం.. రా..

'ఎస్‌జీఎఫ్' ఎంపికలకు కార్యాచరణ

నెలాఖరు వరకు మండలస్థాయి పోటీలు

వచ్చే నెలలో జిల్లాస్థాయి క్రీడలు



నేరేడిగుంటలో కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 26 : పాఠశాలల్లో క్రీడల సందడి నెలకొన్నది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపికలు ఉత్సాహంగా సాగుతున్నాయి. నెలాఖరుతో మండలస్థాయి ఎంపికలు పూర్తిచేసి.. వచ్చే నెల ఆరంభంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి పాఠశాల విద్యాశాఖ ఏటా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నది. ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 21 నుంచి మండలస్థాయి ఎంపికలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 30తో మండలస్థాయి పోటీలు పూర్తిచేసి.. వచ్చే నెలలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నారు.

28 మండలాల్లో ఎంపికలు

సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాల్లో మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన బాల, బాలికలు అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపికల్లో పాల్గొంటున్నారు. ఒక్కో మండలం నుంచి ప్రతీ క్రీడాంశంలో నాలుగు జట్ల చొప్పున 12 టీమ్‌లను జిల్లా స్థాయిలో ఆడేందుకు ఎంపిక చేయనున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జోనల్, రాష్ట్ర స్థాయి ఆడనున్నారు.

మండలానికి రూ.10 వేలు

ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు ఒక్కో మండలానికి రూ.10 వేల చొప్పున నిధులను కేటాయించారు. కుర్చీలు, తాగునీరు, భోజనం, టెంట్లు, మైక్‌సెట్, బ్యానర్, బహుమతులు ఇచ్చేందుకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. క్రీడల నిర్వహణకు దాతల సహకారం కూడా తీసుకుంటున్నారు. పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్య తెలిపారు.

పకడ్బందీగా ఎంపికలు

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమే. క్రీడాకారులకు పేరు ప్రఖ్యాతలతో పాటు ప్రభుత్వ కొలువుల్లో ప్రాధాన్యం పెరిగింది. బాలబాలికల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఎస్‌జీఎఫ్ పోటీలు దోహదం చేస్తాయి. ఈ నెలాఖరు వరకు మండల స్థాయి ఎంపికలు పూర్తిచేసి.. వచ్చే నెలలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తాం. అక్కడ ప్రతిభ చూపినవారు జోనల్, రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారు.

-ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, సంగారెడ్డి జిల్లా



ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పోలీసులంటే భయం వద్దు

వారి సేవలు వినియోగించుకోవాలి

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఆగస్టు 26: ఎలాంటి పైరవీలు లేకుండా ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా సేవలు వినియోగించుంటూ.. వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ.. ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందన్నారు. ప్రజావాణి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు.

ఎంసీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

తల్లీ బిడ్డల ప్రాణం కాపాడిన వైద్యులు

మెదక్ కల్చరల్, ఆగస్టు 26: మెదక్ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ వెల్లడించారు. చిన్నశంకరంపేట మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల జ్యోతి పురిటినొప్పులతో బాధపడుతుండటంతో ఆదివారం ఉదయం మెదక్ ఎంసీహెచ్‌కు తీసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం మహిళ గర్భంలో శిశువుతో పాటు భారీ కణితి ఉన్నట్టు గుర్తించారు. డాక్టర్ శివదయాల్ ఆధ్వర్యంలో వైద్యులు శిల్ప, సునీల్, సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి కణితి తొలగించి తల్లీ బిడ్డల ప్రాణం కాపాడారు. అనంతరం వారు మాట్లాడుతూ జ్యోతిని రెండో కాన్పు కోసం ఎంసీహెచ్ ఆసుపత్రికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. గర్భిణి మహిళలల్లో కణితి ఏర్పడడం చాలా అరుదుగా జరుగుతుందని, అలాంటి కణితి ఉన్నట్టు గుర్తించి శస్త్రచికిత్స చేసి తొలగించామని తెలిపారు. వైద్య బృందానికి మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న మహిళతో మెదక్ ఎంసీహెచ్ వైద్యబృందం



శివలింగానికి 41 వేల లీటర్ల

పంచామృత, రుద్రాభిషేకాలు

● 41వేల బిల్వ పత్రాలతో పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

మెదక్ కల్చర్, ఆగస్టు 26: మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లిలో కోయ్యగుట్ట మల్లికార్జునస్వామి ఆలయానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే శివలింగానికి 41 లీటర్ల పంచామృత, రుద్రాభిషేకాలు నిర్వహించారు. 41 వేల బిల్వపత్రాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లికార్జున్ పంతులు, భక్తులు, శబరి మాత భజన మండలి బృందం తదితరులు పాల్గొన్నారు.

వానలు కురవాలని పూజలు


బండమీది పాశం తింటున్న భక్తులు

వెల్దుర్తి, ఆగస్టు 26: వర్షాలు సమృద్ధిగా కురవాలని మండల పరిధిలోని బస్వాపూర్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నాలుగోసోమవారం సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వానలు కురవాలన ఆచారం ప్రకారం బెల్లంతో చేసిన పాశంను బండపై ఉంచి భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరగించారు.


వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నిధులు ఆపేసి కక్ష సాధింపు

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్/వెల్దుర్తి, ఆగస్టు 26: నర్సాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆయాశాఖల మంత్రులకు విన్నవిస్తే నిధులు మంజూరు చేయడం లేదు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కూడా ఆపేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా మంజూరు చేసిన ఎస్‌డీఎఫ్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపి వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా రద్దు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేటాయించకుండా వివక్ష చూపుతుందని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిం, నాయకులు ప్రసాద్, రాజేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాసాయిపేట, వెల్దుర్తి మండలాలకు చెందిన 47మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ తరఫున నిలబడే అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాసాయిపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో రెండు ఇళ్లలో చోరీ

● 18 తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు అపహరణ

నర్సాపూర్, ఆగస్టు 26: నర్సాపూర్ మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు పడి 18 తులాల వెండి పట్టీలు, రూ.20వేల నగదు అపహరించారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ లింగం వివరాలను వెల్లడించారు. గొల్లపల్లికి చెందిన ఎర్రగొల్ల ముత్యాలు, భర్త రాములు ఆదివారం బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. అర్ధరాత్రి దాటాక దొంగలు తాళం పగలగొట్టి బెడ్‌రూంలోని ఓ పెట్టేలో ఉన్న 18 తులాల వెండి పట్టీలు, రూ.10వేల ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలో శ్రీనాథ్ గౌడ్ ఇంట్లో కూడా రూ.10వేలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదాల నివారణ

ప్రతి ఒక్కరి బాధ్యత

● గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గజ్వేల్, ఆగస్టు 26: రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. గజ్వేల్‌లోని ఆయా చౌరస్తాల్లో సోమవారం గజ్వేల్ సీఐ బి.సైదాతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని, నంబర్ ప్లేట్ లేని 42 వాహనాలపై, మూడు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని చెప్పారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారి వెంట అదనపు సీఐ ముత్యంరాజు, ఎస్ఐలు శంకర్, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, దామోదర్, చంద్రమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



















జన్మాష్టమి వేడుకల్లో నీలం

పటాన్‌చెరు పరిధిలో సోమవారం నిర్వహించిన కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ పాల్గొన్నారు. బీరంగూడా సాయికృప కాలనీలో జన్మాష్టమి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

- పటాన్‌చెరు, ఆగస్టు 26

కొర్వి కృష్ణస్వామి సేవలు ఎనలేనివి : పులిమామిడి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26 : కొర్వి కృష్ణస్వామి సేవలు ఎనలేనివని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు అన్నారు. కొర్వి కృష్ణస్వామి 131వ జయంతి వేడుకలను సంగారెడ్డిలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబంలో జన్మించిన కృష్ణస్వామి ఎంతో కష్టపడి విద్యనభ్యసించారని, చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసి, ముంబై వెళ్లి ఉన్నత చదువులు అభ్యసించారని గుర్తుచేశారు. హైదరాబాద్ చరిత్రపై, గోవాలో స్వాతంత్రోద్యమం తదితర అంశాలపై పుస్తకాలను రచించారన్నారు. మేయర్‌గా ఉన్న కాలంలో హైదరాబాద్‌కు మాస్టర్‌ప్లాన్ రూపొందించి నగరంపై చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు మురళీధర్, ఉపాధ్యక్షుడు తిర్మల్‌రావు, జనార్దన్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి కృష్ణ, కార్యదర్శి కృష్ణ, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పులిమామిడి రాజు, తదితరులు

ఉలువలతో మురళీలోలుడి చిత్రం



గజ్వేల్, ఆగస్టు 26: ఉలువలతో కృష్ణుడి చిత్రాన్ని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కృష్ణుడు బోధించిన భగవద్గీతను ప్రతీ ఒక్కరు పాటించాలని, హిందూ ధర్మ సంస్కృతీ సంప్రదాయాలను, ధర్మాన్ని మర్చిపోవద్దన్నారు.

చిత్రాన్ని చూపుతున్న రామకోటి రామరాజు

కేతకీలో శ్రావణ పూజలు



సంగమేశ్వరుడి దర్శనానికి క్యూలైన్‌లో రద్దీ

ఝరాసంగం, ఆగస్టు 26 : ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం నాలుగో సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణ సందడిగా మారింది. ఉదయం అమృతగుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్లా వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారుల అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మండల పరిధిలోని మాచూనూర్ శివారులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● యువకుడికి గాయాలు

రామచంద్రాపురం, ఆగస్టు 26 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. సీఐ జగన్నాథ్ కథనం ప్రకారం.. లింగంపల్లి నుంచి పటాన్‌చెరువైపు వేగంగా వెళ్తున్న అశోక్‌లేలాండ్ ట్రాలీ రామచంద్రాపురం వద్ద రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని మహిళ(45)ను ఢీకొన్నది. అదే సమయంలో యాక్టివాపై వెళ్తున్న అసాబ్(22)ను ఢీకొన్నది. ఈ ఘటనలో తలకు తీవ్రంగాగాయాలై మహిళ మృతిచెందగా, యువకుడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ కానిస్టేబుల్ దశరథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ... ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 22 : సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ శివారులో రెండు కార్లు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసు కున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణానికి చెందిన సనాహుల్లా తన తండ్రి సాదత్‌హుల్లా, తాత అసద్ హుల్లాతో కలిసి హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు కారులో వెళుతున్నాడు. పొన్నాల గ్రామ శివారులోని బ్రిడ్జ్ వద్దకు రాగనే ఎదురుగా రాంగ్ రూట్లో అతివేగంతో వస్తున్న కారు వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొన్నది. అసద్ హుల్లాకు ఎడమ కాలు విరగగా, సాదత్‌హుల్లాకు ఛాతిలో గాయమైంది. రెండు కార్లు డామేజ్ అయినట్లు పోలీసులు తెలిపారు. రాంగ్ రూట్లో వస్తున్న ధర్మారం గ్రామం పెద్దపల్లి జిల్లాకు చెందిన సత్యనారాయణపై సనాహుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని విద్యార్థికి గాయాలు



బాలుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 26 : రోడ్డు ప్రమాదంలో గురుకుల విద్యార్థికి గాయాలైన సంఘటన సోమవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డుపై చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేట గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ గుర్రాలగొంది సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 15 రోజుల కింద దగ్గరి బంధువు చనిపోవడంతో ఇంటికి వెళ్లి సోమవారం గురుకుల పాఠశాలకు వచ్చాడు. నిత్యావసర సరుకులు తెచ్చుకునేందకు పాఠశాల నుంచి గ్రామానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు అతడిని కారు ఢీకొనగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మనోజ్‌కుమార్‌ను 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఇదే విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నామని చెప్పారు. బంధువు చనిపోవడంతో 15 రోజులుగా ఇంటికి వెళ్లి రాలేదు. హాస్టల్‌కు వచ్చేముందు తల్లిదండ్రులను తీసుకుని రావాలని ముందే ఫోన్‌లో చెప్పగా, ఎలాంటి సమాచారం లేకుండా వచ్చి బ్యాగు లోపల పెట్టి తిరిగి మళ్లీ బయటకు వెళ్లాడని, ఇంతలోనే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని తెలిపారు.

ఎలుగు బంటి దాడి.. రైతుకు తీవ్ర గాయాలు

హవేళిఘణపూర్, ఆగస్టు 25 : ఎలుగుబంటి దాడిలో ఓ రైతుకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ధూప్‌సింగ్ తండాలో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడి గ్రామ పంచాయతీ పరిధిలోని ధూప్‌సింగ్ తండాకు చెందిన కెతావత్ రవి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం రోజువారీ మాదిరిగానే వరి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే పక్కనే ఉన్న పొదల్లోంచి ఎలుగుబంటి ఒక్కసారిగా వచ్చి రవిపై దాడి చేసింది. ఎడమ దవడ, చెవి, కాళ్లకు, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు ఎలుగుబంటిని చెదరగొట్టగా అడవిలోకి వెళ్లింది. తీవ్రగాయాలైన రవిని మెదక్ ప్రభుత్వాసుత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రవికి చికిత్స నిమిత్తం రూ.10,000 ఫారెస్టు అధికారులు అందించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



తిరుపతి(ఫైల్)

కోహెడ, ఆగస్టు 26 : పురుగుల మందు తాగి ఒకరు మృతిచెందిన ఘటన కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంగునూరు తిరుపతి(35) జీవనోపాధి కోసం 15 ఏళ్ల క్రితం కరీంనగర్‌కు వెళ్లాడు. అక్కడ చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ భార్య భవాని, కుమారుడు శివధనుష్, కూతురు శ్రీనిత్యతో ఉంటున్నాడు. గ్రామంలో తనకు ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ బావి వద్దకు వెళ్లుతున్నట్లు ఇంట్లో చెప్పి ఆదివారం కోహెడకు వచ్చారు. రాత్రి అయినప్పటికిని ఇంటికి రాకపోవడంతో పలుమార్లు భర్తకు భార్య భవాని ఫోన్ చేయగా తిరుపతి లిఫ్ట్ చేయలేదు. సోమవారం భూమిని కౌలుకు తీసుకున్న రైతు యాదగిరి వెళ్లగా తిరుపతి పురుగుల మందు తాగి పడి ఉన్నట్లు గమనించి భార్యకు, గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తిరుపతి పని కోసం సౌదీ దేశానికి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ మేరకు మెడికల్ టెస్ట్‌లో ఫెయిల్ అయినట్లు, అలాగే ఉన్న అప్పులు ఎలా తీర్చాలని తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తిరుపతి భార్య పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి, కూతురు అదృశ్యం

టేక్మాల్, ఆగస్టు 26 : మండల పరిధిలో మూడు రోజుల క్రితం తల్లికూతుళ్ల అదృశ్యమైనట్లు టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్ సోమవారం తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు... వెంకటాపూర్ గ్రామానికి చెందిన కిష్టమ్మ, దుర్గయ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. చిన్న కుమార్తె సరస్వతి(26) భర్త రెండేళ్ల క్రితం మృతిచెందాడు. సరస్వతి తన కూతురు భార్గవితో ఈనెల 23న నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి కిష్టమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

శాస్త్రీయ నృత్య తోటమాలి

● ఖేడ్ చిన్నారులకు పేరిణి, క్లాసికల్ నృత్యాల్లో శిక్షణనిస్తున్న ప్రశాంత్
● ఐదు బ్యాచ్‌లలో 200 మందికి శిక్షణ
● శిష్యులతో అనేక ప్రదర్శనలు





వేములవాడలో శివరాత్రి పర్వదినాన ప్రదర్శన ఇచ్చిన తోట ప్రశాంత్ బృందం, పేరిణి నృత్య భంగిమలో తోట ప్రశాంత్

నారాయణఖేడ్, ఆగస్టు 26 : పేరణి నృత్యం, భరత నాట్యం గురించి వినడమే తప్ప, మూరుమూల నారాయణఖేడ్ ప్రాంతంలో ఎవరికీ పరిచయం లేదు. రెండేళ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన పేరణి నృత్యకారుడు తోట ప్రశాంత్ ఖేడ్‌లో పేరణి లాస్యం, తాండవం, క్లాసికల్ డ్యాన్సులలో శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. తనకు వచ్చిన శాస్త్రీయ నృత్య రీతులను నలుగురికి నేర్పుతూ కళను సంరక్షించే తోటమాలిగా నిలుస్తున్నాడు.

పట్టణంలోని సాయిబాబా ఆలయంలోని ధ్యాన మందిరంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌లలో 200 మంది వరకు శిక్షణ పొందారు. ప్రోత్సహించేవారు ఉంటే.. ఏ రంగలంలోనైనా రాణిస్తామని నారాయణఖేడ్ చిన్నారులు నిరూపిస్తున్నారు. చిన్నారులు షిర్డీ, తిరుపతి, వేములవాడ క్షేత్రాలతో పాటు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, లలిత కళాతోరణం, త్యాగరాయగానసభ, రవీంద్రభారతి తదితర చోట్ల అనేక ప్రదర్శనలు ఇచ్చి, ప్రశంసలు పొందారు. ఖేడ్ ప్రాంతంతో పాటు ఎక్కడ ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగిన చిన్నారులు పాల్గొంటున్నారు. ఇంకా అనేక మంది నృత్యంలో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు.

8వ తరగతి నుంచే నృత్యంపై ఆసక్తి

8వ తరగతి నుంచే నృత్యం పట్ల ఆసక్తి కనబరిచాను. నా సోదరుల ప్రోత్సాహంతో గురువు డాక్టర్ కళాకృష్ణ, పేరణి ప్రకాష్, టంగుటూరి బీమన్‌పటేళ్ల వద్ద శిక్షణ పొందాను. పేరణి లాస్యం, తాండవం, క్లాసికల్ డ్యాన్సులలో శిక్షణ పొంది హర్యానా, ఢిల్లీ, కేరళ, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. ప్రస్తుతం నా అభిరుచికి అనుగుణంగా నిజామాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్‌లలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాను.

- తోట ప్రశాంత్, పేరణి నృత్యం శిక్షకుడు

150 మందితో కూచిపూడి నృత్య ప్రదర్శన

వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26 : ఒకేసారి 150 మంది కూచిపూడి కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చి వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. సంగారెడ్డిలోని సెయింట్ అంథోనీస్ హైస్కూల్‌లో ఆదివారం సాయంత్రం నటరాజ స్ఫూర్తి డ్యాన్స్ అకాడమీ, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో నృత్య ప్రదర్శన ఇచ్చి వండర్ బుక్‌లో నమోదయ్యారని సంస్థ ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, అరుణ్‌కుమార్ తెలిపారు. మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థలకు కళామతల్లికి కూడా సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు రామప్ప, ప్రదీప్, నాగరాజు, మా ఇల్లు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పురస్కారం అందజేస్తున్న మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్

స్థానిక సంస్థ ఎన్నికల్లో అధిక స్థానాలు సాధించాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



రఘునందన్‌రావుతో అరుణ్‌కుమార్‌రెడ్డి

ములుగు, ఆగస్టు 26 : స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు సాధించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం ములుగు మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మండల కోకన్వీనర్ సత్యంయాదవ్, క్రాంతి, అభిషేక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

కంఠంలో ఊపిరి ఉన్నంత వరకు మరువను

● రామాయంపేటలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నా
● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

రామాయంపేట, ఆగస్టు 26 : నా కంఠంలో ప్రాణమున్నంత వరకూ మీ కోసమే పని చేస్తా.. మిమ్మల్ని మరువనని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రామాయంపేట మండలం కోనాపూర్ పెద్దతండాలో సోమవారం సేవాలాల్, జగదాంబ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మైనంపల్లికి బంజారా మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాను రామాయంపేటలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానన్నారు. తమ కుటుంబం ప్రజాసేవలో ఆస్తులు దారపోసేందుకు వెనుకాడదన్నారు. ఇప్పటికే సొంత నిధులతో బోర్లు వేయించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబం ఎన్ని కుట్రలు చేసినా మీ ఆశీర్వాదంతో తన కుమారుడు రోహిత్ ఎమ్మెల్యేగా గెలిచాడన్నారు. ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు తెస్తామని మైనంపల్లి ప్రకటించారు. ఆయన వెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతారావు,రాష్ట్ర నాయకులు పల్లె రామచంద్రగౌడ్, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చప్పెట ముత్యంరెడ్డి, కౌన్సిలర్లు దేమే యాదగిరి, సుందర్‌సింగ్ ఉన్నారు.



మాట్లాడుతున్న మైనంపల్లి హన్మంతరావు

డంపింగ్‌యార్డులు నిరుపయోగం

● వృథాగా సెగ్రిగేషన్ షెడ్లు

కొండాపూర్, ఆగస్టు 26 : గ్రామాల్లో నిర్మించిన డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్ల ప్రక్రియ నిర్మాణాలకే పరిమితమయ్యాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, ఎరువులను తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని భావించగా నిరుపయోగంగానే మిగిలాయి. 500 మంది జనాభాకు ఒక వ్యక్తిని నియమించి, రిక్షాను కేటాయించి ఇంటింటికీ తిరిగి వ్యర్థాలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. గదుల్లో వ్యర్థాలను విభజించి వివిధ పద్ధతుల్లో వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలి. వాటి నుంచి తయారైన ఎరువులను విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధి కోసం వినియోగించాలని లక్ష్యం. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం, స్వచ్ఛత చేకూరుతుందని రెండు విధాలుగా పంచాయతీలకు లాభమనుకున్నారు. కానీ, ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. మండల పరిధిలో 24 పంచాయతీల్లో షెడ్లు, తొట్లు నిర్మించి, చెత్తను సేకరించేందుకు రిక్షాలను కూడా తీసుకొచ్చారు. అవన్నీ మూలన పడి వెక్కిరిస్తున్నారు. ప్రభుత్వ నిధులన్నీ వృథాగా మారాయి. సేకరించిన చెత్తను పర్యావరణానికి హానీ కలిగేలా ఎక్కడపడితే అక్కడ డంపింగ్ చేసి కాల్చుతున్నారు. చెత్తతో పాటు ప్లాస్టిక్ వస్తువులను కాల్చడం ద్వారా వాతావరణం కాలుష్యం అవుతుంది. ఆహార వ్యర్థాల కోసం కుక్కలకు డంపింగ్ చేసిన దగ్గర గుమిగూడి అటుగా వచ్చిన వారిని బెంబేలెత్తిస్తున్నాయి.

ప్రతీ రూపాయి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

ప్రజల సొమ్మును దుర్వినియోగం పరిచడం సరికాదు. ఐదేళ్ల క్రింతం నిర్మాణాలు చేపట్టి వృథాగా ఉంచారు. డంపింగ్‌యార్డుల ద్వారా ప్రయోజనం లేకుండా పోయింది. వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

- రాజయ్య, సీపీఎం రైతు సంఘం నాయకుడు

చెత్త సేకరణ అమల్లో ఉంది

ప్రతీ గ్రామంలో చెత్త సేకరణ జరుగుతుంది. సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి హరితహారంలో నాటిన మొక్కలకు వేశాం. గ్రామ స్థాయిలో పర్యవేక్షించి అమల చేసేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాస్, ఎంపీవో





కొండాపూర్ పంచాయతీలో మూలనపడిన రిక్షాలు



తమ్మలిబాయ్ తండాల్లో నిర్మాణానికి పరిమితమైన సెగ్రిగేషన్ షెడ్డు, తెర్పోల్‌లో డంపింగ్‌యార్డులో చెత్త

అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటాళ్ల బియ్యం సీజ్



పట్టుకున్న బియ్యంతో సీఐ, ఎస్ఐ

మర్కుక్, ఆగస్టు 26: అక్రమంగా తరలిస్తున్న 38 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసిన ఘటన మర్కుక్ మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీడీఎస్ బియ్యాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండల పరిధిలోని పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోత్ నవీన్ మినీ వ్యాన్‌లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు నర్సన్నపేట వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ దామోదర్ వాహనాన్ని పట్టుకున్నారు. 38 క్వింటాళ్ల రేషన్‌బియ్యంతో పాటు మినీవ్యాన్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

78 కేజీల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, ఆగస్టు 26 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తుని నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 78 కేజీల ఎండు గంజాయిని సోమవారం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. తుని నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు టాటా సఫారీలో అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు పక్కా సమాచారంతో సంగారెడ్డి, మెదక్ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సోమవారం ఆ శాఖ సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో కంకోల్‌టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. 78కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడు అష్రఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



సంగారెడ్డి గణేష్‌నగర్‌లోని శ్రీ మురళీకృష్ణాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు


సంగారెడ్డి మండలం కులబ్‌గూర్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో రాధాకృష్ణ వేషధారణలో విద్యార్థినులు


పటాన్‌చెరు జేపీ కాలనీ శ్రీకృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పూజలు


జహీరాబాద్‌లో శ్రీక్రిష్ణ గోపికల వేషధారణలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు


వట్‌పల్లిలో శ్రీకృష్ణుడి, గొల్లభామ వేషధారణలో చిన్నారులు



గుమ్మడిదల, జిన్నారం మండలకేంద్రాల్లో రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకుంటున్న చిన్నారులు


కల్హేర్:ఖానాపూర్(కె)లో చిన్ని క్రిష్ణులు, గోపిక


నారాయణఖేడ్‌లో నియోప్రగతి పాఠశాలలో కృష్ణుడి వేషధారణలో ఉట్టి కొడుతున్నబాలుడు


కంగ్టి: బీరాల్‌లో రాధాకృష్ణ వేషధారణలో..


అల్లాదుర్గంలో వెన్న కోసం వెతుకులాట..


సంగారెడ్డిలో చిన్నారి కృష్ణుడి బోసినవ్వులు


మెదక్ అర్బన్: వివిధ వేషధారణలో శ్రీ సరస్వతీ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు

అలరించిన జన్మాష్టమి వేడుకలు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 26:

శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణాలయాల్లో భక్తుల సందడి చోటు చేసుకున్నది. ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. పలుచోట్ల శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో చూపరులను ఆకట్టుకున్నారు. కృష్ణుడి వేషధారణతో చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా కొనసాగాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌లో గల శ్రీమురళీ కృష్ణాలయంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును సన్మానించారు. సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని శ్రీ సరస్వతి శిశుమందిర్ రాధా కృష్ణ, గోపికల వేషధారణతో చేసిన నృత్య రూపకం పలువురిని అలరించింది. పటాన్‌చెరు జేపీ కాలనీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ కృష్ణ ఆలయంలో ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి పూజలు నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ వద్ద శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి చౌరస్తా వరకు విద్యార్థులు, నాయకులు ఆటపాటలు, సాంస్కృతిక నృత్యాలతో ఊరేగింపు చేపట్టారు. విద్యార్థులు ఉత్సాహభరితంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. వట్‌పల్లి, జిన్నారం, గుమ్మడిదల, కల్హేర్, నారాయణఖేడ్, కంగ్టి


తూప్రాన్: శ్రీకృష్ణజన్మాష్టమి శోభాయాత్రలో మహిళ కోలాటం

మండలాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మెదక్ జిల్లాలో...

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలో సోమవారం స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలతోపాటు మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్ స్వగృహంలో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండవగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికలు, రాధ వేషధారణలో ఆబాల గోపాలాన్ని ఆకట్టుకున్నారు. ప్రధాన రహదారుల వెంట విద్యార్థులు కోలాటం, చెక్క భజన, జడకొప్పు, నృత్యాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలాగే శ్రీ సరస్వతీ కాన్వెంట్ స్కూల్‌లో వేడుకులను ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి శ్రీనివాసరావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పంజా విజయ్‌కుమార్, పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలోని గీతామందిరంలో పూజారి ఉదయ్‌శర్మ, చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా గణపతిపూజ, శ్రీగోపాలకృష్ణస్వామికి అష్టాదశ ద్రవ్యములు, ఫలరసాలతో మహాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం, రాత్రి పట్టణంలో స్వామి వారి శోభాయాత్ర, డోలారోహణం నిర్వహించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గోకుల కృష్ణ మందిరంలో ధ్వజారోహణం, గోమాతకు పూజలు జరిపారు. సోమేశ్వరాయలం నుంచి కృష్ణ మందిరం వరకు ఉత్సవ విగ్రహాన్ని భజన సంకీర్తనలు, కోలాటాలు, డప్పు సన్నాయిల మధ్యం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు అలరించాయి. పెద్దశంకరంపేటలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో, సంస్కార్ విద్యాలయంలో విద్యార్థినులు గోపికల వేశాధారణలో కోలాటాలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకోగా, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులతో ఉట్టిని కొట్టించారు. సంస్కార్ విద్యాలయంలో చిన్నారులను శ్రీ కృష్ణ తులాభారం కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా అల్లాదుర్గం, నిజాంపేట, పాపన్నపేట, రామాయంపేట, శివ్వంపేట, చిలప్‌చెడ్, వెల్దుర్తి, నర్సాపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో చిన్నారులు వివిధ వేషధారణలతో ఊరేగింపులు, సాంస్కృతి కార్యక్రమాలు, ఉట్టికొట్టే కార్యక్రమాలను వేడుకగా జరుపుకున్నారు.


చిన్నశంకరంపేటలో ఊరేగింపు


పెద్దశంకరంపేటలో శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో వివిధ వేషధారణలో అలరిస్తున్నచిన్నారులు


నిజాంపేట: శ్రీకృష్ణుడు, గోపికల వేషాధారణలో విద్యార్థుల ఆటపాటలు


పాపన్నపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


రామాయంపేటలో చిన్నారి


శివ్వంపేట: గుండ్లపల్లిలో కృష్ణుడి విగ్రహంతో ఊరేగింపులో గ్రామస్థులు, చిన్నారులు


మనోహరాబాద్‌లో కృష్ణాష్టమి వేడుకలు


చిలప్‌చెడ్ నవభారతి పాఠశాలలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థుల కోలాటం

పురుగుల మందు తాగిన వివాహిత మృతి

శివ్వంపేట, ఆగస్టు 26: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది వారం రోజుల క్రితం పురుగుల మందు తాగిన వివాహిత ఆస్పత్రిలో మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన సుండు ఇందిరమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ నెల 19న కొత్తపేటలో పురుగుమందు తాగి రాఖీ కట్టేందుకు పుట్టిల్లు అయిన వెల్దుర్తి మండలం రామయ్యపల్లి గ్రామానికి వెళ్లి ఇంట్లో పడిపోయింది. కుటుంబ సభ్యులు మెదక్ ఆసుపత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి గుండు వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

బెదిరిన దున్నపోతు.. ఈడ్చుకెళ్లడంతో బాలుడి మృతి


రాజు(ఫైల్)

కంగ్టి, ఆగస్టు 26: సొంత పశువులను మేపేందుకు వెళ్లిన బాలుడిని ప్రమాదవశాత్తు దున్న ఈడ్చుకెళ్లడంతో మృతి చెందాడు. ఈ ఘటన కంగ్టి మండల పరిధిలోని నాగూర్.కె లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. నాగూర్.కె గ్రామానికి చెందిన బల్మూర్ మారుతి, పార్వతి దంపతుల రెండో కుమారుడు రాజు(10) స్థానిక ప్రభుత్వపాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. సెలవురోజుల్లో తమ ఇంటి పశువులను మేపుతూ కూలీపనులకు వెళ్లే తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఎప్పటిలాగే ఆదివారం సెలవు కావడంతో గేదెలను మేపేందుకు దున్న పోతుపై కూర్చొని గేదెలను తరుముకుంటూ పొలానికి బయలుదేరాడు. ఈక్రమంలో దున్న పోతుకు కట్టిన తాడును రాజు తన నడుకుముకు కట్టుకొని నెమ్మదిగా నడుస్తున్న దున్నను కట్టెతో చిన్నగా కొట్టాడు. దీంతో బెదిరిన దున్నపోతు వేగంగా పరిగెత్తింది. ఈ క్రమంలో తాడు కట్టుకున్న రాజును సైతం బండరాళ్లు, ముళ్లపొదల్లోంచి ఈడ్చుకెళ్లింది. బాలుడి అరుపులు విని అక్కడే పనులు చేకుంటున్న తల్లిదండ్రులు వచ్చి తీవ్రంగా గాయపడిన కుమారుడిని కర్ణాటకలోని బీదర్ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పాఠశాలలో చురుకుగా ఉండే రాజు ప్రమాదవశాత్తు మృతిచెందడంతో గ్రామంలోవిషాద చాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రుల రోదనలు అందరినీ కలచివేశాయి.

కూలీ కోసం వచ్చిన కార్మికుడు ..

మనోహరాబాద్, ఆగస్టు 26: కూలీ కోసం వచ్చి గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధి కూచారంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చత్తీస్‌ఘర్ రాష్ట్రానికి చెందిన కేర్ సాగర్, నరేష్ కుమార్ చక్రవర్తి, సార్వన్ కూమార్, లాల్‌సాయి నలుగురు కలసి మండలంలోని కూచారం గ్రామంలోని ఓ పరిశ్రమలో పని చేసేందుకు ఆదివారం వచ్చారు. సాయంత్రం కూచారంలోని పరిశ్రమ వద్దకు రాగానే కేర్ సాగర్ కళ్లు తిగిరి కిందపడిపోవడంతో మేడ్చేల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయాడని నిర్ధారించారు. సోమవారం మృతుడి అన్న నరేష్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్, ఆగస్టు 26 లారీని ఢీ కోట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలపాలైన ఘటన మండల పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ నరిసింహ మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామానికి చెందిన జశ్వంత్, అరవింద్, పవన్‌కల్యాణ్ ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై మనోహరాబాద్ నుంచి మేడ్చేల్ వైపు బయలుదేరారు. వారు కాళ్లకల్ శివారులోని ఫ్యామిలీ దాబా 44 వ జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే రోడ్డు దాటుతున్న లారీని ప్రమాదవశాత్తు బైక్ ఢీ ఢీకొనడంతో జశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారి సహాయంతో కోంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జశ్వంత్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

చండూరులో యువతి అదృశ్యం

చిలప్‌చెడ్, ఆగస్టు 26: మండలంలోని చండూరు గ్రామంలో యువతి అదృశ్యమైంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు గ్రామానికి చెందిన నీరుడి ప్రమీల కుమార్తె నీరుడి స్వాతి(20) ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి భోంచేసి 10 గంటలకు పడుకుంది. మరునాడు ఉదయం 4 గంటల ప్రాంతంలో స్వాతి సోదరుడు సతీష్ నిద్ర లేచేసరికి స్వాతి ఇంట్లో కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. ఆమె ఛామన చాయ కలిగి 4 అడుగుల 5 అంగులాల ఎత్తు ఉంటుందని తెలిపారు. అదృశ్యమైన సమయంలో పింక్ కలర్ టాప్, తెలుపు రంగు ప్యాంటు వేసుకుందని తెలిపారు. స్వాతి తల్లి నీరుడి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

ఇస్తాంపూర్‌లో వృద్ధురాలు..


ముత్యాలమ్మ(ఫైల్)

తూప్రాన్, ఆగస్టు 26: వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన పిట్టల ముత్యాలమ్మ (80) ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 21న ముత్యాలమ్మ కొడుకు, కోడలు పనికి వెళ్లి రాత్రి 8గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. ముత్యాలమ్మ ఇంట్లో కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువు ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ముత్యాలమ్మకు మతిస్థిమితం లేదని తెలిపారు. కొడుకు పిట్టల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

సీతారాంపూర్‌లో కొర్వి కృష్ణస్వామికి నివాళి

నర్సాపూర్,ఆగస్టు 26: కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతి సందర్భంగా మండలంలోని సీతారాంపూర్‌లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా నాయకుడు పెంటయ్య, ప్రతినిధులు శ్రీశైలం, మల్లేశం, భిక్షపతి, పోచయ్య, లక్ష్మన్ తదితరుల ఆధ్వర్యంలో కొరివికృష్ణస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజల హృదయాల్లో నిలిచిన విఠల్‌రెడ్డి


విఠల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ తదితరులు

నర్సాపూర్, ఆగస్టు 26: ఐదు సార్లు నర్సాపూర్ ఎమ్మెల్యేగా సీపీఐ నుంచి పనిచేసి ఇక్కడి ప్రజల హృదయాలలో నిలిచిన గొప్ప నాయకుడు చిలుముల విఠల్‌రెడ్డి అని మాజీ మున్సిపల్ ఛైర్మన్ మురళీధర్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి జయంతి సందర్భంగా నర్సాపూర్‌లోని ఆయన విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా నిజాయితీగా సాధారణ జీవితం గడుపుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిషలు పాటుపడ్డ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, మాజీ ఎంపీపీ రమణారావు, కౌన్సిలర్ యాదగిరి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

కార్పెట్లు, మ్యాట్లు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్

కౌడిపల్లి, సెప్టెంబరు 26: తండ్రి బాన్సువాడ కిషన్‌రెడ్డి జ్ఞాపకార్థం మహ్మద్ నగర్ మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆరు అంగన్‌వాడీ సెంటర్లకు కార్పెట్లు, మ్యాట్లను అందజేశారు. సోమవారం మండలంలోని మహ్మద్‌నగర్, కొత్త చెరువుతండా, గేట్‌తండా, కన్నారం, శేరితండా, కొర్రతండా, మహ్మద్‌నగర్ ఉన్నత పాఠశాలకు, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ. 40 వేల విలువ చేసే కార్పెట్లు, మ్యాట్లను మహ్మద్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో మహిపాల్‌రెడ్డి అందజేశారు.

అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన మదర్‌థెరిసా

జహీరాబాద్, ఆగస్టు 26: ఎందరో అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన మాతృమూర్తి మదర్‌థెరిసా అని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాతృమూర్తి మదర్‌థెరిసా114వ జంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజ్, జనార్ధన్, కిట్టు, శ్యాంసుందర్, మోహన్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

28న దిగ్వాల్ గురుకులంలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కోహీర్ ఆగస్టు 26: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల గురుకుల ఇంటర్ కళాశాలలో ఈనెల 28వ తేదీన బైపీసీ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. రాములు తెలిపారు. అడ్మిషన్‌లో ఎస్సీలకు 10, ఎస్సీసీ 1, బీసీలకు 2, మైనారిటీలకు 1, ఓసీలకు 1, సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7396041646 నంబరును సంప్రదించాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పుల్‌కల్, ఆగస్టు 26: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం పుల్కల్‌లో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.దుర్గారెడ్డి పంపిణీ చేశారు. కాగా వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.22, 68,500 లక్షల విలువైన చెక్కులు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

● నారాయణఖేడ్: సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను సోమవారం ఎంపీ సురేష్ షెట్కార్ స్వగృహంలో జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గంలోని కద్పల్ తండాకు చెందిన రాధాబాయికి రూ.18 వేలు, అంతర్గాంకు చెందిన అనితకు రూ.17,500, సిర్గాపూర్‌కు చెందిన అబ్దుల్ అజీంలకు రూ.45వేల విలువైన చెక్కులను అందజేసినట్టు తెలిపారు.

నేడు అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీలు

రామాయంపేట, ఆగస్టు 26: రామాయంపేటలో మంగళవారం అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. క్రీడా దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు బొంతల సత్యం తెలిపారు.

అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు


హైదరాబాద్‌లో కూచిపూడి కళాకారులకు జ్ఞాపికలతో సన్మానిస్తున్న దృశ్యం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 26: 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా సుమన్ ఆర్ట్ థియేటర్స్ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు అలరించాయి.

ఈ పోటీలో కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన కూచిపూడి నాట్యాచార్యులు అంజయ్యగౌడ్ నిర్వహిస్తున్న శృతిలయ కూచిపూడి ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఊచిపూడి నృత్య ప్రదర్శన ఏక నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులు నృత్య కళాకారుడు అంజయ్యగౌడ్‌తో పాటు నృత్య కళాకారులకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నృత్య కళాకారులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో ఖేడ్ ఎమ్మెల్యే పూజలు

నారాయణఖేడ్, ఆగస్టు 26: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని మార్వాడీగల్లీలో రాధాకృష్ణ మందిరంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సతీమణి అనుపమారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఉమ్మడి మెదక్‌జిల్లా, జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు సైతం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం చెప్పారు.


ఖేడ్ కృష్ణ మందిర్‌లో ఎమ్మెల్యే దంపతుల పూజలు

బోర్లెంలో ఆది బసవేశ్వరుడికి పూజలు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బొర్లెం గ్రామంలో ప్రసిద్ధి చెంచిన ఆదిబసవేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీచ్కుంద ఆశ్రమ పీఠాధిపతి సోమాయప్ప మహరాజ్ ఆశీస్సులను పొందారు. ఎమ్మెల్యే వెంట బొర్లెం తాజా మాజీ ఎంపీటీసీ శ్రావణిదేవేందర్‌రెడ్డి, ఖేడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి, మాజీ సర్పంచు దిగంబర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


జహీరాబాద్: అల్లీపూర్‌లో గార్డెన్‌దొర విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గార్డెన్‌దొర సేవలు అమోఘం: మాణిక్‌రావు

జహీరాబాద్, ఆగస్టు 26: జహీరాబాద్ ప్రాంత అభివృద్ధికి గార్డెన్ దొర చేసిన సేవలు అమోఘమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అల్లీపూర్‌లో గల గార్డెన్ దొర 32వ వర్ధంతిని ఎమ్మార్‌హెచ్‌ఎస్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. గార్డెన్‌దొర విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో విద్యాభివృద్ధికి గార్డెన్‌దొర చేసిన కృషి అభినందనీయమన్నారు. జహీరాబాద్‌లో పాఠశాలను నెలకొల్పి ఎంతోమందిని విద్యావంతులుగా తయారు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా మనందరం కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గార్డెన్‌దొర అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలకు సన్మానం


సన్మాన సభలో ఎంపీలు, ప్రముఖులు

నారాయణఖేడ్, ఆగస్టు 26: కర్ణాటకలోని జిల్లా కేంద్రమైన బీదర్‌పట్టణంలో సోమవారం అక్కడి నాగరిక అభినందన సమితి ఆధ్వర్యంలో ఎంపీలకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. సభలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, బీదర్ ఎంపీ సాగర్ ఖండ్రేలను ఎంపీలుగా గెలిచిన సందర్భంగా బీదర్‌జిల్లా బాల్కిలోని హీరే మఠం పీఠాధిపతి గురు బసవపట్టే దేవరు, కర్ణాటక రాష్ట్ర ఆటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, మున్సిపల్‌శాఖమంత్రి రహీంఖాన్ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు పండుగలా జరగాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీగౌడ్

మెదక్ అర్బన్, ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో నిర్వహించాలని, మెదక్ జిల్లాలో అత్యధిక సభ్యత్వాలు అయ్యే విధంగా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి తలపెట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి రాజశేఖర్, పరిణిత, మురళీయాదవ్ రఘువీరారెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, శ్రీనివాస్, నందారెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బీరంగూడా వార సంతను తరలించొద్దు

పటాన్‌చెరు, ఆగస్టు 26: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడా సంతను తరలించకూడదని కూరగాయల వ్యాపారులు, బీరంగూడాకు చెందిన పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కొందరు వ్యక్తులు సోమవారం ఉదయం సంతను నిర్వహించకూడదని అడ్డుకోగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బీరంగూడా నాయకులు మున్సిపల్ వైస్ ఛైర్మెన్ నందారంనర్సింహగౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ ఎడ్లరమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆదెళ్లి రవీందర్, నాయకులు మాకంమల్లేష్ తదితరులు వ్యాపారులకు నచ్చజెప్పారు. వారు మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికి ఫోన్‌చేసి పరిస్థితి వివరించి గత 30ఏళ్లుగా ఇక్కడ ప్రతీ సోమవారం సంత కొనసాగుతోందని కొందరికి ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో సంతను తరలిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సంతను తరలించేందుకు అధికారికంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని కమిషనర్ వివరణ ఇచ్చారు. సంతను అక్కడే నిర్వహించాలని ఆదేశించారు. వ్యాపారులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే వారికి అండగా ఉంటామని బీరంగూడా నాయకులు స్పష్టం చేశారు.